క్లుప్తంగా

గ్రామదేవతల అనుగ్రహం పొందాలి

• ఎమ్మెల్యే బాలునాయక్



ఎమ్మెల్యే బాలునాయక్‌ను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

చందంపేట : గ్రామదేవతల అనుగ్రహం పొంది సుఖసంతోషాలతో ఉండాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ ఆకాంక్షించారు. శనివారం మండలంలోని తెల్దేవర్‌పల్లి గ్రామంలో సీతారామచంద్ర స్వామి, ఆంజనేయస్వామి శివలింగం, విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ జైపాల్ రెడ్డి, లక్ష్మణ్‌నాయక్, మహాలక్ష్మయ్య, కిన్నెర హరికృష్ణ, ఇద్దయ్య, జర్పుల బద్యానాయక్, గోసుల అనంతగిరి తదితరులు పాల్గొన్నారు.

9న సీపీఐ మండల మహాసభ

చింతపల్లి : భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) మండల మహాసభ ఈ నెల 9న మాల్ వెంకటేశ్వర్‌నగర్‌లో నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల కార్యదర్శి పోలే వెంకటయ్య శనివారం తెలిపారు. మండల మహాసభకు ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నరసింహారెడ్డి హాజరవుతున్నట్లు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు.

పాఠ్యపుస్తకాల పంపిణీ



హెచ్‌ఎంకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈఓ రాములు

పెద్దవూర : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందజేసే పాఠ్య పుస్తకాలను ఆయా పాఠశాలలకు మండల విద్యాధికారి తరి రాములు శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలు తమ పాఠశాలలకు సంబంధించిన పాఠ్య పుస్తకాలను మండల విద్యా వనరుల కేంద్రానికి వచ్చి తీసుకెళ్లాలని సూచించారు. పాఠశాల పునఃప్రారంభ రోజైన 12న విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేయాలన్నారు.

విగ్రహాలకు జలాభిషేకం



విగ్రహాలకు జలాభిషేకం చేస్తున్న గ్రామస్తులు

నిడమనూరు : మండలంలోని రాజన్నగూడెం గ్రామంలో ఆదివారం బొడ్రాయిని ప్రతిష్ఠించనున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో రెండు రోజులుగా ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహిస్తున్నారు. శనివారం పలువురు దంపతులు దేవత విగ్రహాలకు, అభిషేకాలు, పూజలు నిర్వహించారు. బొడ్రాయి ప్రతిష్ఠతో పాటు శ్రీమహాకాళీ, మహాలక్ష్మి, మహా సరస్వతి అమ్మవార్ల ప్రతిష్ఠ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలకు ఊరేగింపు నిర్వహించి జలాభిషేకాలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో ముంగి శివమారయ్య, మండలి చినలింగయ్య, మజ్జిగపు దయాకర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, నాగిరెడ్డి, రామకృష్ణ, పురోహితులు కృష్ణమాచార్యులు, కొంకపాక రాధాకృష్ణమూర్తి, మారవజ్జుల శ్రీనివా స్‌శర్మ, మోహన్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

నత్తనడకన బ్రిడ్జి నిర్మాణం

• 2022లో రూ.2.85కోట్లతో పనులకు శంకుస్థాపన
• ఏళ్లు గడుస్తున్నా నేటికీ పనులు పూర్తి చేయని కాంట్రాక్టర్
• పట్టించుకోని ఆర్‌అండ్‌బీ అధికారులు



బాబుసాయిపేట వద్ద కొనసాగుతున్న పనులు బ్రిడ్జి



బ్రిడ్జి వద్ద ప్రమాదకరంగా ఉన్న మట్టికుప్పలు

త్రిపురారం : మండల కేంద్రం నుంచి బాబుసాయిపేట గ్రామాల మధ్య చేపట్టిన నూతన బ్రిడ్జి నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. త్రిపురారం మండల కేంద్రం నుంచి బాబుసాయిపేట, పెద్దదేవులపల్లి గ్రామాలను కలుపుకొని హైదరాబాద్ రహదారి వద్దకు చేరుకోవడానికి ఉన్న సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డుగా నిర్మించారు. ఈ రోడ్డు నిర్మాణంలో భాగంగా బాబుసాయిపేట వద్ద తుంగపాడు బొందానికి సమీపంలో ఉన్న పెద్దదేవులపల్లి రిజర్వాయర్ నుంచి నీటి ప్రభావం అధికంగా ఉంటుండడంతో నూతన బ్రిడ్జిని నిర్మించాల్సి వచ్చింది. దీంతో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2022లో నూతన బ్రిడ్జి నిర్మాణానికి సుమారు రూ.2.85కోట్ల నిధులు కేటాయించింది. ఈ నేపథ్యంలో బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టిన సంబంధిత కాంట్రాక్టర్ నేటికీ పనులు పూర్తి చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఏళ్లుగా పనులు కొనసాగిస్తున్నారు. ఈ బ్రిడ్జి నిర్మాణం సకాలంలో పూర్తి చేయకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందుల నడుమ ప్రయాణాలు సాగించాల్సివస్తుంది. సదరు కాంట్రాక్టర్ పనులు నెమ్మదిగా పనులు చేస్తున్నా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడంలేదు. అయితే ఈ రహదారి హైదరాబాద్ వెళ్లడానికి అనుకూలంగా ఉండడంతో పాటుగా ఈ రోడ్డులో నుంచి డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్, విశాఖ పరిశ్రమ, ప్రొఫెసర్ జయ శంకర్ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల, కృషి విజ్ఞాన కేంద్రం, టీజీ మోడల్ స్కూల్, కస్తూరిబా గాంధీ పాఠశాలు, రైస్ మిల్లులు ఉండడంతో నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. ఈ బ్రిడ్జి నిర్మాణంతో ఇబ్బందులు పడకుండా ఉండేందుకు వాహనాల రాకపోకలకు తాత్కాలిక వంతెన నిర్మించారు. ఈ వంతెన గత వర్షాకాలంలో నీటి ప్రవాహనికి తెగి కొన్ని రోజుల పాటు వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచాయి. వరికోతల సమయంలో రైతులు ధాన్యం తరలించే ట్రాక్టర్లు సైతం ఈ తాత్కాలిక వంతెన పైనుంచి వెళ్తూ బోల్తా పడిన సందర్భాలు ఉన్నాయి. ప్రస్తుతం రోడ్డు వెంట మట్టికుప్పలు పోసి చదును చేయకపోవడంతో వదిలేయడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. దుమ్ము సైతం విపరీతంగా వస్తుండడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనబడక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మళ్లీ వర్షాకాలం సమీపిస్తుండడంతో తుంగపాడు బొందానికి నీటి ప్రవాహం వచ్చే అవకాశం ఉన్నందున, సదరు కాంట్రాక్టర్ ఇప్పటికైనా బ్రిడ్జి నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేయాలని, అధికారులు తగిన పర్యవేక్షణ చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

బ్రిడ్జి పనులు త్వరగా పూర్తిచేయాలి



మాగ్రామం వద్ద కొనసాగుతున్న బ్రిడ్జి పనులు ప్రారంభించి మూడు ఏళ్లు దాటింది. అయినా ఇప్పటికీ పనులు సాగుతూనే ఉన్నాయి. ఆ పనులను పట్టించుకునే అధికారులే కరువయ్యారు. కొద్ది రోజులు పనులు చేయకుండా వదిలేశారు. అక్కడ ఏర్పాటు చేసిన తాత్కాలిక వంతెన వల్ల ధాన్యం ట్రాక్టర్లు కూడా బోల్తాపడ్డాయి. వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. త్వరగా బ్రిడ్జి పనులు పూర్తి చేయాలి.

– గంగుల శ్రీనివాస్, రైతు, బాబుసాయిపేట

తాత్కాలిక వంతెనతో ఇబ్బంది పడుతున్నాం



బ్రిడ్జి పనుల కోసం నిర్మించిన తాత్కాలిక వంతెనతో వాహనదారులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రతి ఏటా వర్షాకాలంలో తాత్కాలిక వంతెన తెగి రాకపోకలు నిలిచిపోవడంతో ప్రయాణాలు సాగించలేక పోతున్నాం. మళ్లీ వర్షాకాలం రావడంతో తాత్కాలిక వంతెనతో ఇబ్బందులు తప్పేట్టు లేవు. మట్టికుప్పలు కూడా ఉండడంతో రోజు ఇబ్బందులు అవుతున్నాయి. బ్రిడ్జి పనులు పూర్తి అయ్యే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– ఉల్లెందుల ఎల్లయ్య, బాబుసాయిపేట

పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

• ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి



మాడ్గులపల్లి : లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

మాడ్గులపల్లి : పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని గారకుంటపాలెం, మాచినపల్లి, నారాయణపురం గ్రామాలకు చెందిన 9మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఆయన కన్నెకల్ గ్రామంలో పంపిణీ చేసి మాట్లాడారు. పేదింటి ఆడపడుచుల వివాహానికి తల్లిదండ్రులు ఆర్థికంగా ఇబ్బందులు పడకూడదనే ప్రభుత్వం కల్యాణలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి కొండేటి మల్లయ్య, పార్టీ మండల అధ్యక్షుడు గడ్డం వేణుగోపాల్‌రెడ్డి, బోడ యాదయ్య, భాస్కర్‌రెడ్డి, కొండేటి వెంకన్న, శ్రీను, జూనియర్ అసిస్టెంట్ నాగార్జున పాల్గొన్నారు.

సొంతింటి కలను సాకారం చేస్తా

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్లు నిర్మించి సొంతింటి కలను సాకారం చేస్తామని ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని బోయగూడెం గ్రామంలో 226మందికి ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డితో కలిసి ఆయన ఇళ్ల పట్టాలు, 84 మందికి కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. అర్హులైన ప్రతిఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇస్తామన్నారు. అనంతరం ఎమ్మెల్సీ కోటిరెడ్డి మాట్లాడారు. తహసీల్దార్ అనిల్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో హాలియా ఏఎంసీ వైస్ చైర్మన్ కాంసాని చంద్రశేఖర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కృష్ణనాయక్, నాయకులు అల్లి పెద్దిరాజు, గడ్డం సాగర్‌రెడ్డి, పగడాల సైదులు, మేరావత్ మునినాయక్, కృష్ణారెడ్డి, లింగారెడ్డి, వెంకట్‌రెడ్డి, పల్లా సురేందర్‌రెడ్డి, గడ్డం నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. మండలంలోని రంగుండ్ల గ్రామంలో గిరిజనుల ఆరాధ్య దైవమైన సేవ్యాసాథ్ (బుడియాబాపు) పెద్ద పూజ సందర్భంగా ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రజలతో మమేకమవుతూ..



బస్టాండ్‌లో ప్రజలతో ముచ్చటిస్తున్న జైవీర్‌రెడ్డి

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : నిరంతరం ప్రజాక్షేత్రంలో ప్రజలతో మమేకమవుతూ అధికార యంత్రాంగంతో బిజీబిజీగా ఉండే ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి శనివారం తన సింపుల్ సిటీని ప్రదర్శించాడు. మండలంలోని బోయగూడెం గ్రామంలో ఇళ్ల పట్టాల పంపిణీకి వెళ్తూ మండల కేంద్రంలోని బస్టాండ్‌లో ప్రజలు ఉండటాన్ని గమనించారు. అనంతరం కారు దిగి ఆయన బస్టాండ్‌లో నిల్చున్న ప్రజల వద్దకు వెళ్లి ముచ్చటించారు. తమ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఏవిధంగా అందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. అక్కడున్న ప్రజలు సైతం తమను చూసి పలకరించడంతో వారి ఆనందానికి హద్దులు లేకుండా పోయాయి. గతంలో జానారెడ్డి కూడా ఇలా పలరించుకుంటూ వెళ్లే వారని, తండ్రి బాటలోనే తనయుడు పయనిస్తున్నాడని అక్కడి వారు చర్చించుకున్నారు.

పేద ప్రజల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

• ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ : పేదల అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం మిర్యాలగూడ మండలం, పట్టణానికి చెందిన 300మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఆయన ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పంపిణీ చేసి మాట్లాడారు. పేదింటి కుటుంబంలో తమ కూతుర్ల వివాహానికి తల్లిదండ్రులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని, వారి ఇబ్బందులను గుర్తించిన ప్రభుత్వం వారికి కల్యాణలక్ష్మి పథకం కింద రూ.లక్ష అందించి ఆదుకుంటుందన్నారు. పేదలు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుంటూ ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



పెద్దవూర : చిన్నగూడెంలో నిర్వహిస్తున్న ర్యాలీలో పాల్గొన్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

పెద్దవూర : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని మండల విద్యాధికారి తరి రాములు అన్నారు. శనివారం మండలంలోని చిన్నగూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, జెడ్పీహెచ్‌ఎస్‌ల ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ నిర్వహించి ఇంటింటి ప్రచారం చేసి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం రెండు జతల యూనిఫాంలు, నోట్‌బుక్స్, పాఠ్యపుస్తకాలను ఉచితంగా అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వేములపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లోనే పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందని హెచ్‌ఎం బి.రమేష్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పలు కాలనీల్లో ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమణారెడ్డి, సుధాకర్, ప్రభాకర్, సైదులు, యాదమ్మ, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

గుర్రంపోడు : మండలంలోని కొప్పోలు గ్రామంలో శనివారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి నోముల యాదగిరి పాల్గొని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బక్రీద్ రోజున జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి బడిబాటలో పాల్గొన్నారు.

చందంపేట : మండలంలోని చిత్రియాల గ్రామంలో శనివారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం కల్పిస్తున్న వసతులపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు నాగేశ్వర్‌నాయక్, ఠాకూర్ నాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి : మండలంలోని దోనియాల, చిన్న అడిశర్లపల్లి గ్రామాల్లో శనివారం కొండమల్లేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కట్టెబోయిన శ్రీనివాస్, యాదగిరి, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.



వేములపల్లిలో బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



చందంపేట : చిత్రియాలలో బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు

భక్తిశ్రద్ధలతో బక్రీద్ వేడుకలు



మిర్యాలగూడ టౌన్ : చిన్న మసీదు కమిటీ చైర్మన్ పాష నివాసంలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, డీఎస్పీ



హాలియాలో ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి



చందంపేట : ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలో, మండలంలో శనివారం బక్రీద్ వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ముస్లింలు, ఈద్గా, మసీదుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పట్టణంలోని బంగారుగడ్డ, అవంతిపురం, టిక్యాతండా వద్ద గల ఈద్గాలు, మసీదులలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అదే విధంగా చిన్న మసీదు కమిటీ చైర్మన్ పాషా నివాసంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్, డీఎస్పీ రాజశేఖర్‌రాజు, మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, నలమోతు సిద్దార్థలకు తేనేటి విందు ఇచ్చారు. కార్యక్రమంలో యడవల్లి శ్రీనివాస్‌రెడ్డి, అన్నబిమోజు నాగార్జునచారి, చిట్టిబాబునాయక్, నూకల వేణుగోపాల్‌రెడ్డి, దేశిడి శేఖర్‌రెడ్డి, బాలు, మహ్మద్ ఇలియాస్, జానీ, సలీం తదితరులున్నారు. మార్కెట్ చైర్మన్ అంకతి సత్యం, ఏజీపీ ఉన్నం చిన వీరయ్య, కాంగ్రెస్ నాయకులు మధు, ప్రభాకర్, ముస్లిం పెద్దలు అక్బర్, జానీ, చోటే, రహీమ్, పెద్ద ఖాజా, ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

డిండి : మండలంలోని ముస్లింలు శనివారం బక్రీద్ పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంతో పాటు మండలంలోని గ్రామాల్లో ఉన్న ఈద్గా వద్ద ప్రార్థనలు చేశారు. అనంతరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

చింతపల్లి : మండల కేంద్రంతో పాటు మండలంలోని గ్రామాల్లో శనివారం ముస్లింలు బక్రీద్ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. మండల కేంద్రంలోని ఈద్గాతో పాటు మండల పరిధిలోని మాల్ వెంకటేశ్వరనగర్, వింజమూరు, కురుమేడు, వెంకటంపేట గ్రామాల్లోని ఈద్గా వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పార్టీల నాయకులు, అధికారులు ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.

దేవరకొండ : పట్టణంలో బక్రీద్ పర్వదినాన్ని ముస్లింలు శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఈద్గాతో పాటు జామియా మజీద్‌లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈద్గా వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

నిడమనూరు : మండలంలో ముస్లింలు శనివారం బక్రీద్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. నిడమనూరులో ఈద్గా వద్ద ప్రార్థనల్లో

పెద్దవూర : మండలంలో బక్రీద్ పర్వదినాన్ని ముస్లింలు శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంతో పాటు ఊట్లపల్లి, చింతపల్లి, శిర్సనగండ్ల, పోతునూరు, పులిచర్ల గ్రామాల్లోని ఈద్గాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఇమాంఖదీర్, ఎండీ మొబిన్, ఎండీ.హైమద్‌అలీ, ఎండీ.హాజీ, షబ్బీర్, ఇస్మాయిల్, జానీమియా, అజీం, సలీం, వజీర్, అబ్దుల్, షరీఫ్, ఖాదర్, తదితరులు పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి : మండలంలో బక్రీద్ పర్వదినాన్ని ముస్లింలు శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ముస్లింలు ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. వేడుకల్లో సలాం, ముజీబ్, మైనుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

అడవిదేవులపల్లి : మండలంలోని మసీదులు, ఈద్గాల వద్ద శనివారం ముస్లింలు బక్రీద్ పండుగ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌కె బాబ్జాన్, బషీర్, సయ్యద్ బాబు, బాబావలి, జానీ తదితరులున్నారు.

చందంపేట : త్యాగానికి ప్రతీకగా జరుపుకునే బక్రీద్ పర్వదినాన్ని ముస్లింలు శనివారం మండలంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా చందంపేట ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో జర్పుల బద్యానాయక్, అనంతగిరి, శ్రీను, వరికుప్పల కొండల్, నజీర్, కలీల్, బషీర్, ఖరీం, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

హాలియా : అనుముల మండలంతో పాటు, హాలియా మున్సిపాలిటీ పరిధిలో ముస్లింల త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్ వేడుకలను శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ముస్లింలు ఇబ్రహీంపేట ఈద్గా వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వేడుకలో ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి పాల్గొని ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ అనుముల మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, నిడమనూరు మార్కెట్ మాజీ చైర్మన్ మర్ల చంద్రారెడ్డి, ముస్లింలు మజహార్ మొహినుద్దీన్, అన్వరుద్దీన్, బాబుద్దీన్, నాయకులు గడ్డం రమణయ్య, కసిరెడ్డి నరేష్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ అక్బర్‌ఖాన్, బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు ఆంజాద్ ఖాన్, ఖలీల్‌ఖాన్, ఇక్బాల్, అన్వర్ ఖాన్, ఎండీ మహమ్మద్, మౌలానా, గౌస్ తదితరులు ఉన్నారు.



చింతపల్లి : ఈద్గా వద్ద ప్రార్థనలు



డిండి : ప్రార్థన చేస్తున్న ముస్లింలు



పెద్దవూర : ఈద్గాలో ముస్లింల ప్రార్థనలు



నిడమనూరులో..



కొండమల్లేపల్లిలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



అడవిదేవులపల్లిలో..

బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలి

దేవరకొండ : నియోజకవర్గంలో బీజేపీ బలోపేతానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కేతావత్ లాలునాయక్, జిల్లా అధ్యక్షుడు వానం నరేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు వసుకల సుధాకర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. సమావేశంలో నాయకులు బెజవాడ శేఖర్, నక్క వెంకటేష్, నేతాళ్ల వెంకటేష్, జల్లా భాస్కర్, రవి పాల్గొన్నారు.

వికసిత భారత్ లక్ష్యంగా ముందుకు

మిర్యాలగూడ : కేంద్రంలో 11సంవత్సరాలుగా నరేంద్రమోదీ ప్రభుత్వం సంకల్పంతో దేశం వికసిత భారత్ లక్ష్యం సాకారం దిశగా ముందుకు సాగుతుందని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కనపర్తి సత్యప్రసాద్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పార్టీ మండల కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మేష్యానాయక్, జిల్లా నాయకులు ఈగ సైదారావు, బి.జానకిరెడ్డి, ప్రధాన కార్యదర్శులు నిమ్మల విజయ్, శ్రీనివాస్, నాగేశ్వర్‌రావు, రంగానాయక్, సైదిరెడ్డి పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలి

చింతపల్లి : గ్రామాల్లో బీజేపీ కార్యకర్తలు స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు సముద్రాల నగేష్ పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చెనమోని రాములు, నాయకులు శివర్ల రమేష్, కూకడపు రామకృష్ణ, ఎగిరిశెట్టి అనిత, వెన్నం శేఖర్, శ్రీనివాస్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

డిండి : పరిపాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కేతావత్ లాలూనాయక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన పార్టీ మండల కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలో వచ్చిన తర్వాత 11వ స్థానంలో ఉన్న ఆర్థిక వ్యవస్థను 4వ స్థానానికి చేర్చిన ఘనత ప్రధానమంత్రి నరేంద్రమోదీదేనని అన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, దేవరకొండ అసెంబ్లీ కన్వీనర్ ఏటి.కృష్ణ, మండల అధ్యక్షుడు సైదా, అంజి, జైపాల్, రామకృష్ణ, రాఘవేంద్ర, సాయికుమార్, అమృత్, సాయిగౌడ్, సందీప్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మాడ్గులపల్లి : మండలంలో బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఇటికాల జాన్‌రెడ్డి అన్నారు. పేదల సంక్షేమానికి 11ఏళ్ల మోదీ ప్రభుత్వం పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం మండల కేంద్రంలో మొక్కలు నాటి ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సజ్జల నాగిరెడ్డి, గడ్డం వెంకట్‌రెడ్డి, బొమ్మకంటి నరసింహ, కడియం సైదులు, వేముల లక్ష్మణ్, మల్లేష్, గురుస్వామి, దశరథ, జక్క ఇంద్ర రాంరెడ్డి, భిక్షం, విద్యాసాగర్, రంజిత్, చిలుముల శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికాభివృద్ధిలో భారత్ నాల్గొవ స్థానం

మిర్యాలగూడ టౌన్ : భారత ప్రధాని నరేంద్రమోదీ దేశంలో ప్రజలకు సుస్థిర పాలన అందించడంతో పాటు ఆర్థికాభివృద్ధిలో దేశం నాల్గొవ స్థానంలో నిలిపారని బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు, వన్ టౌన్ బీజేపీ ప్రభారీ కొండేటి సరిత అన్నారు. భారత ప్రధానిగా అధికారం చేపట్టి 11సంవత్సరాలు అవుతున్న సందర్భంగా శనివారం వన్‌టౌన్ బీజేపీ ఆధ్వర్యంలో ఇంటింటికి మొక్కలు పంపిణీ చేయడంతో పాటు మొక్కలు నాటారు. అనంతరం ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో వన్ టౌన్ అధ్యక్ష, కార్యదర్శులు బంటు గిరి, కొంగరి వెంకటరమణ, బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి చిల్లంచర్ల అభి, ఓబీసీ సెల్ నేత బంటు యాదగిరి, సోములు, శివరాం, అశోక్, రమేష్, చరణ్‌తేజ, రవిచంద్ర తదితరులున్నారు.

ముగిసిన బ్యాడ్మింటన్ శిక్షణ



బహుమతులు అందజేస్తున్న సభ్యులు

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని ఎన్‌ఎస్‌పీ క్యాంపులో గల ఇండోర్ స్టేడియంలో డిస్ట్రిక్ స్పోర్ట్స్ అథారిటీ నల్లగొండ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరం శనివారం ముగిసింది. మే 1నుంచి ప్రారంభమైన ఈ శిక్షణ నల్లగొండ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ సహకారంతో టీషర్ట్స్, కోచింగ్‌కు సంబంధించిన మెటీరియల్‌ను అందించినట్లు బ్యాడ్మింటన్ జిల్లా కోచ్ ఎం.రామకృష్ణ తెలిపారు. ఈ శిక్షణలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు జిల్లా అసోసియేషన్, మిర్యాలగూడ అసోసియేషన్ నిర్వాహకులు బహుమతులు అందజేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు డాక్టర్ జి.అంజయ్య, డాక్టర్స్ అశోక్‌రెడ్డి, ప్రశాంత్, నవీన్‌కుమార్, విక్రాంత్‌రెడ్డి, సికిందర్‌రెడ్డి, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వెంకటేశ్వర్లుకు దళితరత్న అవార్డు



అవార్డు అందుకుంటున్న వెంకటేశ్వర్లు

హాలియా : అనుముల మండలంలోని చల్మారెడ్డిగూడెం గ్రామానికి చెందిన ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ముదిగొండ వెంకటేశ్వర్లుకు దళితరత్న అవార్డు లభించింది. హైదరాబాద్‌లోని బేగంపేట టూరిస్టు ప్లాజాలో శనివారం జరిగిన అవార్డుల ప్రధానోత్సవంలో అంబేద్కర్ జగ్జీవన్‌రామ్ మహనీయుల ఉత్సవ కమిటీ చైర్మన్ ఇటుక రాజు మాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జిల్లా వెంకటేష్ చేతుల మీదుగా ఆయన అవార్డు అందుకున్నారు. రెండు దశాబ్దాల ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో, మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్‌లో గ్రామస్థాయి నుంచి మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయి వరకు వర్గీకరణ ఫలాలు అందేలా కృషి చేసినందుకుగాను అవార్డు అందజేసినట్లు వెల్లడించారు.